వేట..సాంకేతిక బాట

- మారిన చేపల వేట విధానం
- అందుబాటులోకి జీపీఎస్, ఎకో సిస్టం



వేటకు వెళ్లేందుకు వలను సిద్ధం చేస్తున్న మత్స్యకారులు

కావలి/బిట్రగుంట: శాస్త్ర,సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులు పల్లెల రూపురేఖలు మారుస్తున్నాయి. గతంలో వ్యవసాయం, పాడి, చేపల వేట దైవాదీనంగా ఉండేవి. ప్రస్తుతం ఆధునిక ఆవిష్కరణలు వాటిని లాభసాటిగా మారుస్తున్నాయి. యాంత్రీకరణతో వ్యవసాయం మరింత సులభతరమైంది. పొలంలోని భూసారం, తేమశాతం, తెగుళ్లను గుర్తించడంతో పాటు రైతులను తెగుళ్లపై ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసేలా ప్రత్యేక సెన్సార్లు, యాప్‌లు అందుబాటులోకి వచ్చాయి. డ్రోన్లతో పురుగు మందులను పిచికారీ చేయడం కూడా సాధారణంగా మారిపోయింది. వ్యవసాయంతో పాటు తీరప్రాంత గ్రామాల్లో చేపల వేటపై ఆధారపడి జీవనం సాగించే మత్స్యకారులకు కూడా ఇప్పుడు సరికొత్త సాంకేతికత అందుబాటులోకి వచ్చింది. గతంలో పెద్ద వ్యాపారులు మాత్రమే వినియోగించే జీపీఎస్, ఎకో సిస్టం వంటి పరిజ్ఞానాన్ని ఇప్పుడు చిన్నచిన్న పడవల్లో వేటకు వెళ్లే మత్స్యకారులు సైతం వినియోగించి ఆదాయాన్ని పెంచుకుంటున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలో విశాల సముద్ర తీరం ఉంది. కావలి మండలం నందెమ్మపురం నుంచి వాకాడు మండలం వరకు తూర్పుతీరంలోని మత్స్యకార గ్రామాల్లో లక్ష కుటుంబాలకుపైనే సముద్రంలో చేపల వేటపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. ఒకప్పుడు చేపలు ఎక్కడ ఎక్కువ పడతాయి? ఏ సమయంలో ఎక్కువ పడతాయి? అనే విషయాలను మత్స్యకారులు అనుభవం మీదనే తెలుసుకునేవారు. దీంతో వేట అంతంతమాత్రంగా సాగి ఆదాయం కూడా అరకొరగానే ఉండేది. ప్రస్తుతం చేపల వేటలో కెమెరాలు, జీపీఎస్, ఎకో సిస్టం వంటి సాంకేతిక పరికరాలు అందుబాటులోకి రావడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది.

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో..	
తీర ప్రాంతం	: 169 కిలోమీటర్లు
మత్స్యకార గ్రామలు	: 118
మోటారైజ్డ్ బోట్లు	: 7వేలు (అధికారికంగా, అనధికారికంగా కలిపి)
కొయ్య తెప్పలు	: 4వేలు
పెద్దబోట్లు	: 20

మానిటర్‌లో చూసి..

ప్రస్తుతం పెద్ద పడవల్లో జీపీఎస్, ఎకో ఫిష్ ఫైండర్ పరికరాలను వినియోగిస్తున్నారు. సముద్రంలో వేట చేయాలనుకున్న ప్రాంతానికి చేరుకున్న తర్వాత బోటు కింది భాగంలో ఏర్పాటు చేసిన కెమెరాల ద్వారా చేపల కదలికలు గమనిస్తారు. చేపలు గుంపులుగా వచ్చినప్పుడు, ఎక్కువ విస్తీర్ణంలో చేపలు ఉన్నప్పుడు ఎకో ఫిష్ ఫైండర్ ద్వారా శబ్ద తరంగాలు విడుదల చేసి చేపలన్ని ఒకేచోటుకు చేరుకునేలా చేస్తారు. చేపలు గుంపుగా ఎక్కడ, ఎంత విస్తీర్ణంలో ఉన్నాయో ఫిష్ ఫైండర్ మానిటర్‌లో గమనించి ఖచ్చితంగా అక్కడే వల విసురుతారు. దీంతో ఎక్కువ మొత్తంలో చిక్కుతాయి. తద్వారా మత్స్యకారుల ఆదాయాన్ని పెంచుకుంటున్నారు.

సాంకేతికతపై మత్స్యకారులకు శిక్షణ

చేపల వేటలో ఆధునిక సాంకేతిక పరికరాలు అందుబాటులోకి వస్తున్నాయి. వాటి ద్వారా మత్స్యకారులు వేటను సులభంగా సాగించవచ్చు. సాంకేతికతపై శిక్షణ ఇస్తేనే మత్స్యకారులు మార్పునకు మొగ్గు చూపుతారు.జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణం పూర్తయితే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడంపై మత్స్యకారులకు శిక్షణ ఇస్తాం.
– ఎస్ శ్రీనివాసులు, ఏడీ, మత్స్యశాఖ, కావలి

క్లుప్తంగా

మోడల్ స్కూల్ సందర్శన

సీతారామపురం: స్థానిక మోడల్ స్కూల్‌ను ఎంఈఓ మస్తాన్‌వలి శుక్రవారం సందర్శించారు. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి జగనన్న విద్యాకానుక కిట్ల నిల్వకు స్టోర్‌రూములను పరిశీలించారు. ఆదర్శ పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ జమున, ఏపీఎం సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు పరామర్శ



మర్రిపాడు: మర్రిపాడులోని స్వగృహంలో ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిని ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు శుక్రవారం పరామర్శించారు. ఇటీవల గుండె శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న ఎమ్మెల్యే మేకపాటి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని ప్రజాక్షేత్రంలోకి తిరిగి రావాలని ఆకాంక్షించారు. ఆయన వెంట విజయ డెయిరీ డైరెక్టర్ తలచీరు సుబ్బరాయుడు, గంగినేని శ్రీనివాసులునాయుడు, బాలయ్య ఉన్నారు.

ద్విచక్ర వాహనాల వేలం

ఉదయగిరి: స్థానిక సెబ్ కార్యాలయంలో అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ కృష్ణ కిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనాల వేలాన్ని శుక్రవారం నిర్వహించారు. ఉదయగిరి, ఆత్మకూరు సెబ్ కార్యాలయాల పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన నాలుగు ద్విచక్ర వాహనాలను వేలం వేయగా, ప్రభుత్వానికి రూ.73 వేలు ఆదాయం వచ్చిందని సెబ్ అధికారులు తెలిపారు. తొలుత ఏఎస్పీ సెబ్ కార్యాలయ రికార్డులను తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. సెబ్ సీఐ నయనతార, ఉదయగిరి ఎస్సై మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల ఆందోళన

సెబ్ కార్యాలయం ఎదుట ఇందిరానగర్ కాలనీకి చెందిన పలువురు మహిళలు ఆందోళన చేపట్టారు. గురువారం రాత్రి నెల్లూరు సెబ్ స్క్వాడ్ సిబ్బంది తమ కాలనీకి చెందిన కావలి లక్ష్మీదేవి, ఉయ్యాల ఆదెయ్యను నాటుసారా విక్రయిస్తున్నారని అదుపులోకి తీసుకున్నారని, వారి వద్ద సారా లేకపోయిన అడవిలోకి తీసుకెళ్లి విచక్షణారహితంగా కొట్టారని ఆరోపించారు. అధికారులు న్యాయం చేయాలని కోరారు. ఏఈఎస్ కృష్ణ కిషోర్‌రెడ్డి ఆందోళనకారులతో చర్చించడంతో విరమించి వెళ్లిపోయారు.

వాహనాల తనిఖీ

మర్రిపాడు: మండల కేంద్రమైన మర్రిపాడులో నెల్లూరు–ముంబయి జాతీయ రహదారిపై ఎస్సై విశ్వనాథరెడ్డి శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. సరైన వాహన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడుపుతున్న వారికి జరిమానాలు విధించారు.

ప్రజాసేవే లక్ష్యం

జలదంకి: ఉదయగిరి నియోజకవర్గ ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో విద్యార్థులకు అండగా మంచి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ప్రముఖ విద్యావేత్త డాక్టర్ మూల వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. గట్టుపల్లి, రామవరప్పాడు, బ్రాహ్మణక్రాక గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. గ్రామాల్లోని సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. లింగమనేనిపల్లికి చెందిన తాను విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించి అనేక ఉన్నత ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించానని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో జనరంజకమైన పాలనను సాగిస్తున్నారన్నారు. ఆయన స్ఫూర్తితో ఉదయగిరి నియోజకవర్గ ప్రజలకు సేవ చేయాలని నిర్ణయించుకుని గ్రామాల్లో పర్యటిస్తున్నానని తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు కాటా మాల్యాద్రిరెడ్డి, రఘురామిరెడ్డి ఉన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

కొండాపురం : పదోతరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని డిప్యూటీ తహసీల్దార్ కోటేశ్వరరావు అన్నారు. మన పౌండేషన్ ఆధ్వర్యంలో కొండాపురం ఆదర్శ పాఠశాలలోని పదో తరగతి, ఇంటర్మీడియట్‌కు చెందిన 153మంది విద్యార్థులకు పరీక్ష సామగ్రి శుక్రవారం పంపిణీ చేశారు. తొలుత సర్వస్వతి పూజ నిర్వహించారు. ప్రిన్సిపల్ ఖాదర్‌బాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలని ధర్నా

అల్లూరు: నగర పంచాయతీ పరిధిలోని కోళ్లఫారం సంఘం, క్రిస్టియన్‌పేట, పేరంటాలతోపు ప్రాంతాల ప్రజలు తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ నగర పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. వారం రోజులుగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు. స్పందించిన కమిషనర్ ఫణికుమార్ నాలుగు రోజుల్లో మోటార్లకు మరమ్మతులు చేయించి తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

వింజమూరు: మండల సర్వసభ్య సమావేశం వరుసగా నాలుగోసారి వాయిదా పడింది. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ప్రసన్నకుమారి ఆధ్వర్యంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీటీసీలు గైర్హాజరవడంతో కోరం లేక సమావేశాన్ని వాయిదా వేశారు.

‘ఈనాడు’ను బహిష్కరించండి



కావలిలో ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



వింజమూరులో ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కావలి: రాష్ట్ర ప్రభుత్వంపై ‘ఈనాడు’ పత్రికలో లేనిది ఉన్నట్లు, ఉన్నది లేనట్లుగా వార్తలు, కథనాలు ప్రచురిస్తున్నారని, ఆ పత్రికను బహిష్కరించాలని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలో ఉదయగిరి బ్రిడ్జి సెంటర్‌లో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఈనాడు పత్రిక ప్రతులను శుక్రవారం దహనం చేశారు. ఈనాడు, రామోజీరావుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై దుష్ప్రచారం చేసేందుకు పట్టాభిని పోలీసులు కొట్టినట్లుగా నకిలీ ఫొటోలు అచ్చువేసి ఈనాడు తన పక్షపాత వైఖరిని ప్రదర్శించిందని విమర్శించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వేలాది ఎకరాల ప్రభుత్వ భూమిని అక్రమంగా స్వాధీనపరుచుకుని ఫిల్మ్‌సిటీ నిర్మించుకున్న రామోజీరావు..జగన్‌మోహన్‌రెడ్డిపై కక్షతో ఇష్టారాజ్యంగా అబద్ధపు రాతలు రాస్తున్నారని మండిపడ్డారు. ఎల్లో మీడియాకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఎమ్మెల్యే హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కనమర్లపూడి వెంకటనారాయణ, ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్ యాదవ్, జెడ్పీటీసీ జంపాని రాఘవులుగౌడ్, నాయకులు షేక్ షాహుల్ హమీద్, కుందుర్తి కామయ్య, కనపర్తి రాజశేఖర్, గుడ్లూరు మాల్యాద్రి, దేగా రామయ్య యాదవ్, గుర్రం వెంకటేశ్వర్లు, షేక్ నాయబ్ రసూల్, పుల్లా శ్రీనివాసులురెడ్డి, పెనుమల్లి అశోక్, వడ్లమూడి వెంకటేశ్వర్లు, కోటా వెంకట్, చేవూరు కిణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వింజమూరు: స్థానిక బంగ్లా సెంటర్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు ఈనాడు తప్పుడు కథనాల ప్రచురణపై నిరసన వ్యక్తం చేస్తూ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు జూపల్లి రాజారావు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఈనాడు పత్రిక యాజమాన్యం అసత్య ప్రచారాలు చేస్తోందని మండిపడ్డారు. పత్రిక విలువలను తుంగలో తొక్కి మీడియా స్వేచ్ఛను దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.రాయుడు, బాలయ్య, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీకి సన్మానం



మర్రిపాడు : జిల్లా వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం అధ్యక్షుడిగా నియమితులైన మర్రిపాడు మండలం రామానాయుడుపల్లికి చెందిన కొప్పోలు వెంకటేశ్వర్లు నెల్లూరులోని నివాసంలో మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మేకపాటిని శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్, సుధాకర్ తదితరులు ఉన్నారు.

పోలేరమ్మకు పొంగళ్లు

అల్లూరు: అల్లూరులోని పోలేరమ్మ చెట్టు వద్ద శుక్రవారం మధ్యాహ్నం పొంగళ్లు పెట్టారు. ఉదయం పోలేరమ్మకు విశేష పూజలు నిర్వహించి సద్ది నివేదించారు. మధ్యాహ్నం 300 మందికి అన్నదానం చేశారు. పోలేరమ్మ కమిటీ సభ్యులు కోటిరెడ్డి, రమేష్, సురేష్, శ్రీరాములు, బాబులు, సుధ, వేణు, తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న పీడీ సాంబశివారెడ్డి

కావలి రూరల్: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని పొదుపు మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ కేవీ సాంబశివారెడ్డి అన్నారు. పట్టణంలోని గొట్టిపాటి కల్యాణ మండపంలో కావలి, దగదర్తి, బోగోలు, జలదంకి, కలిగిరి, కొండాపురం మండలాల వైకేపీ సిబ్బందితో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ మహిళల జీవనోపాధికి ఫుడ్‌ప్రాసెస్ యూనిట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. మార్చి 31లోగా స్త్రీనిధి, సీఐఎఫ్, వీఆర్ఎఫ్ రుణాల రికవరీ లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అదనపు సంచాలకులు రాజు, ఏరియా కోఆర్డినేటర్ జీ మధుసూదన్‌రావు, డీపీఎంలు, ఏపీఎంలు, తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నంపై కేసు నమోదు

ఆత్మకూరు: ఆస్తి తగాదాల నేపథ్యంలో ఓ వ్యక్తిపై శుక్రవారం మారణాయుధంతో దాడికి పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివశంకర్‌రావు తెలిపారు. వివరాలు..పట్టణంలోని జేఆర్‌పేట ప్రాంతానికి చెందిన గోపికి తన సమీప బంధువులతో ఆస్తి తగాదాలు ఉన్నాయి. చెన్నైకు చెందిన ప్రేమ్‌రాజ్ వరుసకు గోపికి బాబాయి. ఆస్తి వివాదాన్ని సర్దుబాటు చేసేందుకు శుక్రవారం ఆత్మకూరు వచ్చాడు. గోపితో పాటు సమీప బంధువులతో మాట్లాడుతుండగా ప్రేమ్‌రాజ్‌పై ఒక్కసారిగా గోపి మారణాయుధంతో దాడికి పాల్పడ్డాడు. ప్రేమ్‌రాజ్ భుజంపై తీవ్ర రక్తగాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేపట్టిన పోలీసులు గోపిని అదుపులోకి తీసుకుని హత్యాయత్నం కేసు నమోదు చేశారు. నిందితుడ్ని కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మర్రిపాడు: సిమెంట్ ట్యాంకర్ ఢీకొనడంతో మోటార్‌సైకిలిస్ట్ గాయాలపాలయ్యాడు. ఈ ఘటన మర్రిపాడు సమీపంలో నెల్లూరు–ముంబాయి జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు..మర్రిపాడు మండలం పల్లవోలు గ్రామానికి చెందిన ఖాసీంసాహెబ్ పండ్ల వ్యాపారి. రోజూలాగే చుంచులూరులో సపోటాలు విక్రయించి తిరిగి మోటార్‌సైకిల్‌పై మర్రిపాడుకు వస్తున్నాడు. మర్రిపాడు సమీపంలో వెనకవైపుగా సిమెంట్ ట్యాంకర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం ఆత్మకూరుకు తరలించారు. సిమెంట్ ట్యాంకర్ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కొండాపురం : మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం మధ్నాహ్నం నిర్వహించనున్నట్లు జూనియర్ అసిస్టెంట్ ప్రభాకర్ శుక్రవారం తెలిపాడు. ఎంపీపీ బొడ్డు అనురాధ అధ్యక్షతన జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, మండలాధికారులు హాజరుకావాలని కోరారు.

ఉదయగిరి: స్థానిక స్త్రీశక్తి భవనంలో ఎంపీపీ మూలె పద్మజ అధ్యక్షతన శనివారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ శుక్రవారం తెలిపారు. అధికారులు,ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని కాశీనాయన ఆశ్రమం వద్ద ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం పట్టుకున్నట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ బీ నయనతార తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ చీలి కృష్ణయ్యను అదుపులోకి తీసుకుని ట్రాక్టర్‌ను పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు.

రాపూరు దాతృత్వం

సోమశిల: అనంతసాగరం మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సాయంత్రం వేళ ప్రత్యేక తరగతులకు హాజరయ్యే పదో తరగతి విద్యార్థులకు అల్పాహారాన్ని అందించేందుకు జెడ్పీటీసీ సభ్యుడు రాపూరు వెంకటసుబ్బారెడ్డి ముందుకొచ్చారు. పదోతరగతి పరీక్షలు పూర్తయ్యే వరకు తన సొంత నిధులతో ప్రతిరోజూ అల్పాహారాన్ని అందిస్తామని హామీ ఇచ్చారని ఎంఈఓ ఎంఈఓ బాలకృష్ణారెడ్డి శుక్రవారం తెలిపారు. పదోతరగతి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌ను కాంక్షించి జెడ్పీటీసీ అల్పాహారాన్ని అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఆయనకు విద్యార్థులు, తల్లిదండ్రుల తరపున ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి

కావలి: రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు పాటుపడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ బలోపేతానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు కనమర్లపూడి వెంకట నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు పదవి రావడానికి కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. వాణిజ్య విభాగం ద్వారా పార్టీ క్రియాశీలకంగా ఉండేలా కష్టపడి పనిచేస్తానని పేర్కొన్నారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట దర్గాను వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ సిద్దిఖ్ శుక్రవారం రాత్రి దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దర్గా అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. ఇటీవల జరిగిన చిన్నచిన్న ఘటనలు దర్గాకు ఎటువంటి చెడ్డపేరు తీసుకురావని, ప్రభుత్వం ఎప్పుడూ భక్తులకు అండగా ఉంటుందన్నారు. ఆయన వెంట జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ మీరా, డైరెక్టర్ సయ్యద్ షాజహాన్, నెల్లూరు డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్, వైఎస్సార్‌సీపీ నాయకులు కాలేషా ఉన్నారు.

సోమశిలలో వైఎస్సార్ జిల్లా పోలీసుల విచారణ

సోమశిల: సోమశిల జలాశయం లోతట్టు ప్రాంతంలో జాలరి అనుమానాస్పద మృతిపై వైఎస్సార్ జిల్లా గోపవరం ఎస్సై చంద్రశేఖర్ తన సిబ్బందితో కలిసి శుక్రవారం విచారణ చేపట్టారు. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు పట్టణం సంజీవనగర్‌కు చెందిన రామాంజనేయులు సోమశిలకు చెందిన వ్యాపారి వద్దకు చేపల వేట పనికి వచ్చాడు. వైఎస్సార్ జిల్లా పరిధిలోని సోమశిల జలాశయం లోతట్టు ప్రాంతంలో సోమవారం శవమై తేలాడు. స్థానికుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన గోపవరం పోలీసులు శుక్రవారం జలాశయం లోతట్టు ప్రాంతంలో నివాసం ఉంటున్న జాలర్లను విచారించారు.

గృహసారథులు సంక్షేమ సారథుల్లా వ్యవహరించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: గృహసారథులు సంక్షేమ సారథుల్లా వ్యవహరించాలని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 32,34 వార్డులకు చెందిన గృహసారథులతో శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వడ్డిపాలెంలో జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను గడపగడపకు తీసుకెళ్లేందుకు గృహసారథులు, వార్డు సచివాలయ కన్వీనర్లను నియమించినట్లు తెలిపారు.ఇప్పటికే పార్టీలకతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించడంలో వలంటీర్లు విజయవంతమైన పాత్ర పోషించి ప్రజల ప్రశంసలు అందుకుంటున్నారన్నారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు తమ పరిధిలోని ప్రజలతో మమేకమై ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందేలా చూడడమే కాకుండా వైఎస్సార్‌సీపీ అన్ని వేళల్లో అన్ని రకాలుగా అండగా ఉంటుందని భరోసా ఇవ్వాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కనమర్లపూడి వెంకట నారాయణ, నాయకులు కనపర్తి రాజశేఖర్, కుందుర్తి కామయ్య, షేక్ షాహుల్‌హమీద్, అనురాధ, పుల్లా శ్రీనివాసులురెడ్డి, గుర్రం వెంకటేశ్వర్లు, కొండలు, మాల్యాద్రి, లక్ష్మణ్, దేగా రామయ్య యాదవ్, వడ్లమూడి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

గ్రిగ్ పోటీల ఓవరాల్ చాంపియన్ కొరిమెర్ల



ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్న కొరిమెర్ల విద్యార్థులు



విజేతలుగా నిలిచిన చేజర్ల విద్యార్థులు

సంగం: కొరిమెర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో మూడ్రోజులుగా నిర్వహిస్తున్న గ్రిగ్ మెమోరియల్ క్రీడా పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ఆత్మకూరు నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో 490 మంది బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. బాలబాలికలకు వేర్వేరుగా కబడ్డీ, ఖోఖో, షటిల్, వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, తదితర పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో కొరిమెర్ల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటి ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. కబడ్డీ పోటీల్లో సంగం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సీనియర్, జూనియర్ బాలబాలికల జట్లు విజేతలుగా నిలిచాయి. కొరిమెర్ల ఉన్నత పాఠశాలకు చెందిన బాలుర జట్టు షటిల్ పోటీల్లో విజేతగా నిలిచింది. విజేతలకు సర్పంచ్ మీరమ్మ, జెడ్పీటీసీ రావుల లక్ష్మి, ఎస్సై నాగార్జునరెడ్డి, ఎంఈఓ జానకీరాం, వైఎస్సార్‌సీపీ నేత ప్రసాద్‌రెడ్డి, తదితర చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

చేజర్ల: ఆత్మకూరు నియోజకవర్గ స్థాయి గ్రిగ్ మెమోరియల్ క్రీడా పోటీల్లో చేజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో సీనియర్, జూనియర్ బాలికల జట్లు విజేతలుగా నిలిచాయి. వాలీబాల్ పోటీల్లో జూనియర్ బాలుర జట్టు విజేతగా నిలిచింది. త్రోబాల్ పోటీల్లో సీనియర్ బాలికల జట్టు రన్నర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా విజేతలను పీడీ మల్లికార్జునరావు అభినందించారు.

మేకల దొంగల అరెస్ట్

ఉదయగిరి: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగితీగ, మేకల అపహరణకు పాల్పడిన నిందితులను ఉదయగిరి పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఉదయగిరి సర్కిల్ కార్యాలయంలో సీఐ వీ గిరిబాబు విలేకరులకు వెల్లడించారు. ఉదయగిరి మండలం బోడబండకు చెందిన బీ రమణయ్య తన రెండు మేకలను ఈ నెల 21న గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల దర్యాప్తులో వైఎస్సార్ జిల్లా బ్రహ్మంగారిమఠానికి చెందిన ఎస్ మోషెయ్య, ఆశీర్వాదం, రామదాసు దొంగతనం చేసినట్లుగా తేలింది. నిందితులను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా దుత్తలూరుకు చెందిన గురునాథంతో కలిసి వరికుంటపాడు, దగదర్తి, కండలేరు, చింతగుంట, రాపూరు, ఏఎస్‌పేట, పొదలకూరు, సైదాపురం పోలీస్‌స్టేషన్ల పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగితీగను చోరీ చేసినట్లు అంగీకరించారు. దీంతో నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రెండు మేకలు, ఒక మోటార్‌బైక్, కొంత రాగితీగ, తదితరాలను స్వాధీనం చేసుకునట్లు సీఐ తెలిపారు. ఉదయగిరి ఎస్సై ఎస్ ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

చెక్కనగిషీ స్టాల్‌ను సందర్శించిన గవర్నర్



ఉదయగిరి: హైదరాబాద్‌లోని నెక్లెస్‌రోడ్డులో పీపుల్ ప్లాజాలో నిర్వహించిన వీ కార్ట్ ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన ఉదయగిరి చెక్కనగిషీ కేంద్రం స్టాల్‌ను తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ శుక్రవారం సందర్శించారు. చెక్కనగిషీ వస్తువుల తయారీ విధానాన్ని నిర్వాహకుడు జాకీర్‌ను అడిగి తెలుసుకుని అభినందించారు.

భూముల రీసర్వేపై గ్రామసభ

ఉదయగిరి: మండలంలోని శకునాలపల్లి గ్రామ సచివాలయం ఆవరణలో భూముల రీసర్వేపై తహసీల్దార్ సానా శ్రీనివాసులురెడ్డి శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. శకునాలపల్లి, కుర్రపల్లి గ్రామాల్లో సోమవారం నుంచి భూముల రీసర్వే చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. రీసర్వేకు రైతులు సహకరించాలని కోరారు. రీసర్వేకు సంబంధించి రైతులకు ముందుగా నోటీసులు జారీచేస్తామన్నారు. రైతులు భూములకు సంబంధించిన ధ్రువీకరణపత్రాలతో సిద్ధంగా ఉండాలన్నారు. సర్పంచ్ కల్లూరి వెంకటేశ్వర్లురెడ్డి, వీఆర్వో అనూష, సర్వేయర్ వెకటరమణ, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు

ఆత్మకూరురూరల్: ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ లక్ష్మీనరసింహం హెచ్చరించారు. బోయలచిరివెళ్ల పరిధిలో హైవేకు ఆనుకుని ప్రభుత్వ భూమి నాలుగెకరాలు ఉంది. కుమ్మరి కొట్టాలుగా పిలిచే ఈ ప్రదేశాన్ని ఆక్రమించేందుకు మూడ్రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు యత్నించారు. ఈ విషయమై గ్రామస్తుల నుంచి ఫిర్యాదులు అందుకున్న తహసీల్దార్ లక్ష్మీనరసింహం సీఐ నాగేశ్వరరావు, ఎస్సై శివశంకర్‌రావుతో కలిసి శుక్రవారం ఘటనా స్థలానికి చేరుకున్నారు. చెట్టుకు కట్టి ఉన్న జెండాలు, వస్త్రాలను తొలగించారు. ఆర్ఐ పృధ్వీ, వీఆర్వో హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

ఆత్మకూరురూరల్: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న తెలుగు భారతి సేవా సమితి ఆధ్వర్యంలో ఆత్మకూరులో నిర్వహించిన ప్రతిభా పోటీల్లో ప్రతిభకనబర్చిన మహిమలూరు మండల పరిషత్ ఆదర్శ పాఠశాల విద్యార్థులను ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు. హెచ్ఎం షేక్ ఇస్మాయిల్ , ఉపాధ్యాయులు రమేష్, రఫీ, వెంకటేశ్వర్లు, రవీంద్రకుమార్, దయాకర్ పాల్గొన్నారు.

వసతిగృహం తనిఖీ

వింజమూరు: బీసీ వసతి గృహాల్లోని విద్యార్థులకు రుచికరమైన భోజనం వడ్డించాలని జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకటయ్య వార్డెన్లకు సూచించారు. పట్టణంలోని బీసీ వసతిగృహంలో పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. అనంతరం వసతిగృహాన్ని తనిఖీ చేశారు. ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించి సూచనలు చేశారు. కావలి డివిజన్ అసిస్టెంట్‌బీసీడబ్ల్యూఓ సుధాకర్‌రావు, వార్డెన్లు శ్రీలత, వెంగళరావు, రియాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలను కాపాడుకోవాలి

ఆత్మకూరు: దేవాలయాలు హైందవత్వానికి ప్రతీకలని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్క హిందూవుపై ఉందని దేవాలయాల పరిరక్షణ సమితి అధ్యక్షుడు కుర్తాళం కమలానంద భారతిస్వామి పేర్కొన్నారు. పట్టణంలో నిర్మాణంలో ఉన్న పాండురంగస్వామి ఆలయంతో పాటు సత్యసాయిబాబా మందిరం, శివాలయాలను శుక్రవారం ఆయన సందర్శించారు. పాండురంగస్వామి ఆలయ నిర్మాణకర్తలను అభినందించారు. దేవాలయాలతోనే సామాజిక అభివృద్ధి సాధ్యమని, దేవాలయాల పరిరక్షణకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.